ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 సంచిక : 06 ఫిబ్రవరి 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......... 30-11-2011

అరుణాచలం ... 08-12-2011

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-11-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున సుబ్రహ్మణ్య షష్ఠి. దీనిని తమిళనాడులో స్కందషష్ఠి అంటారు. మనం రామా రామా అని ఎలా అనుకుంటామో తమిళనాడులో మురుగన్ మురుగన్ అని అనుకుంటారు. అందమూ, జ్ఞానమూ కలిస్తే ఎలా ఉంటాయో వాడు మురుగన్. మనం మహా విష్ణువు యొక్క అవతారమే రాముడు అని ఎలా అనుకుంటున్నామో అలా శివుడి యొక్క మరో రూపమే సుబ్రహ్మణ్యుడు అని తమిళనాడులో చెబుతారు.

గణపతి, సుబ్రహ్మణ్యుడు వీళ్ళిద్దరూ అన్నదమ్ములు. పార్వతి తయారుచేసిన బొమ్మలోనుండి గణపతికి ప్రాణం వచ్చింది. అందుకు గణపతిని పార్వతి కొడుకు అంటారు. సుబ్రహ్మణ్యుడు శివుడి కొడుకు అంటారు. ఈ సుబ్రహ్మణ్యుడు అంతకుముందు ఒక ఋషిగా ఉండేవాడు అని అతని పేరు సనత్‌కుమారుడు అని అతడే సుబ్రహ్మణ్యుడిగా అవతరించాడు అని చెబుతారు. ఒకసారి సనత్‌కుమారుడికి శివుడు దర్శనమిచ్చి నీకు ఏమి కావాలి అని అడిగాడు. నాకు ఏమీ అవసరం లేదు నువ్వు నాకు ఏమీ ఇవ్వనక్కరలేదు అన్నాడు సనత్‌కుమారుడు. వాళ్ళు పరిపూర్ణమైన జ్ఞానులు. వాడికి ప్రపంచంలో ఏమీ ఆకర్షణ లేదు. అప్పుడు శివుడు అన్నాడు నీకు నేను వరమిస్తానంటే ఏమీ వద్దు అంటున్నావు, నాకు నువ్వు ఏమైనా ఇస్తావా అని అడిగాడు. ఇస్తాను, నీకు ఏమి కావాలి అని సనత్‌కుమారుడు అడిగాడు. నువ్వు నాకు

కుమారుడిగా పుట్టాలి అన్నాడు శివుడు. అంటే తారకాసురుడి సంహారం కోసం అడిగాడు. స్త్రీ గర్భంలో ప్రవేశించి మటుకు నేను రాను. నీ మూడో నేత్రం జ్ఞాననేత్రంలోంచి రమ్మంటే వస్తాను అన్నాడు. అందుచేత పార్వతి గర్భంలో ప్రవేశించకుండా శివనేత్రంలోంచి జ్ఞానతేజం వచ్చింది. ఆ తేజస్సుని మొదట అగ్ని భరించాడు. తరువాత అగ్ని భరించలేక ఆ తేజస్సును గంగానదిలో విడిచిపెట్టేసాడు. శివుడి యొక్క తేజస్సుని గంగానది భరించలేక గంగానది ప్రక్కన ఉన్న శరవణ తటాకంలో ఆ తేజస్సుని గంగానది వదిలేసింది. శరవణ తటాకంలో శివుడి యొక్క తేజస్సుకి ఒక రూపం వచ్చింది. వాడే సుబ్రహ్మణ్యుడు. ఆ పిల్లవాడిని కృత్తికలు పెంచారు. ఆరుగురు కృత్తికలు కలిసి ఆ పిల్లవాడికి పాలు ఇస్తే, ఆ పిల్లవాడు ఆరుముఖాలు పెట్టుకొని ఆ పాలు తాగేవాడు. అందుచేత వాడిని షన్ముఖుడు అన్నారు. షణ్ముఖం అంటే ఆరుముఖాలు కలవాడు. తిథుల లెక్కలో ఆరవరోజున షష్ఠి వస్తుంది. అదే సుబ్రహ్మణ్యషష్ఠి. శరవణభవ అనే తటాకములో రూపము ధరించాడు కాబట్టి కొందరు శరవణభవుడు అంటారు. సుబ్రహ్మణ్యుడికి రూపం వచ్చిన తరువాత భూమి మీద లేడు, కైలాసం వెళ్ళిపోయాడు. కైలాసంలో తల్లిదండ్రుల దగ్గరే పెరిగాడు.

సుబ్రహ్మణ్యుడు చిన్నపిల్లవాడుగా ఉండగా ఒక సంఘటన జరిగింది. కొంతమంది ఋషులు శివుడి దర్శనానికి వెళ్ళారు. ఆ ఋషులు కొంతమంది గోచీలు పెట్టుకున్నారు. కొంతమంది ఋషులు దిగంబరంగా ఉన్నారు. దిగంబరంగా ఉన్న ఋషులని చూచి సుబ్రహ్మణ్యుడు పక్కున నవ్వాడు. అప్పుడు పార్వతి సుబ్రహ్మణ్యుడిని దగ్గరకి పిలిచి అలా నవ్వకూడదు, వాళ్ళు చాలా పెద్దవాళ్ళు వాళ్ళకి నమస్కరించాలి. వాళ్ళు కామాన్ని జయించారు. స్త్రీ, పురుష భేదం ఉన్నవాడు ఎవడూ దిగంబరంగా ఉండలేడు, గోచీపెట్టుకొని ఉండలేడు. వాళ్ళ గొప్పతనం, వాళ్ళ ఔన్నత్యం నీకు తెలియటంలేదు. బ్రహ్మచర్య దీక్ష ఉన్నవారు కాని గోచీ పెట్టుకొని ఉండలేరు, దిగంబరంగా ఉండలేరు. ఆ ఋషులను మనం పూజించాలి, గౌరవించాలి కాని నవ్వకూడదు అని పార్వతి సుబ్రహ్మణ్యుడికి చెప్పింది.

సుబ్రహ్మణ్యుడు తారకాసురుడిని సంహారం చేయటానికి వచ్చాడు కాబట్టి వీడు కైలాసంలో కూర్చుంటే ఎలాగ వాడిని నువ్వు భూమిమీదకు పంపాలని శివుడిని దేవతలు ప్రార్థించారు. సుబ్రహ్మణ్యుడిని భూమి మీదకు తీసుకురావటానికి నారదుడిని ఉపాయం

ఆలోచించమన్నారు దేవతలు. గణపతి, సుబ్రహ్మణ్యుడు ఇద్దరూ శివుడి దగ్గర కూర్చుని ఉండగా నారదుడు ఒక పండు తెచ్చి శివుడికి ఇచ్చాడు. రెండు పళ్ళు పట్టుకెళితే ఇద్దరికీ చెరో పండు ఇస్తాడు కదా శివుడు. ఒకటే పండు పట్టుకెళ్ళాడు. చిన్నపిల్లలు కదా ఆ పండు నాకు కావాలి అంటే నాకు కావాలి అన్నారు. అప్పుడు శివుడు ఏమన్నాడు అంటే భూమి చుట్టూ ప్రదక్షిణం చేసి ముందుగా ఎవరు వస్తే వారికి పండు ఇస్తాను అన్నాడు. సుబ్రహ్మణ్యుడు నెమలి వాహనుడు. ఆయన నెమలి వాహనమెక్కి భూప్రదక్షిణకి బయలుదేరివెళ్ళాడు. గణపతికి వాహనం ఎలుక. మొత్తం భూప్రదక్షిణ అంతా ఎలా చేయగలడు. నెమలి అంత స్పీడుగా మూషికం వెళు తుందా? అందుచేత గణపతి ఏమి చేసాడు అంటే గణపతి దగ్గర తెలివితేటలు ఎక్కువ ఉ న్నాయి. చిన్నపిల్లలు తెలివికోసం, విజయంకోసం వినాయకుడి పూజ చేస్తారు. పెళ్ళిళ్ళు చేసినా, యజ్ఞాలు చేసినా, ఏదైనా అర్చనలు చేసినా ముందు వినాయకుడినే ఆరాధిస్తారు. అంటే వినాయకుడు విజయానికి గుర్తు. వినాయకుడు శివుడు చుట్టూ, పార్వతి చుట్టూ తిరిగేసి శివుడితోటి ఏమని చెప్పాడంటే ఈ సృష్టి అంతా నీలోనే ఉంది. ఇంక భూమి ఎక్కడ ఉంది. నువ్వు భూప్రదక్షిణ చేయమన్నావు నేను చేసేసాను అన్నాడు. శివుడు ఆ పండు వినాయకుడికి ఇచ్చేసాడు. అప్పుడు సుబ్రహ్మణ్యుడు భూప్రదక్షిణ అంతా చేసి వచ్చాడు. వినాయకుడు పండు తినేస్తున్నాడు. అది చూసి సుబ్రహ్మణ్యుడికి కోపం వచ్చింది. సుబ్రహ్మణ్యుడికి కోపం తెప్పించాలనే నారదుడు చేసిన ప్లాను. వాడికి కోపం వస్తేకాని భూమి మీదకు రాడు. అప్పుడు శివుడు ఏమన్నాడు అంటే నువ్వు ఆ పండు తింటేపోతుంది. ఆత్మజ్ఞానం అనే పండువి నువ్వు. నీకు ఆ పండు ఎందుకు? అన్నాడు. అయినా సుబ్రహ్మణ్యుడికి కోపం తగ్గలేదు. అప్పుడు అక్కడనుంచి భూమి మీదకు వచ్చాడు. బట్టలు తీసేసి వైరాగ్యంతోటి గోచీ పెట్టుకొని పళని దగ్గర ఒక కొండ మీద కూర్చున్నాడు. ఆయన్ని పళనీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అన్నారు. ఆయన భూమి మీదకు వచ్చిన కార్యక్రమం అంతా పూర్తిచేసుకుని విశ్రాంతిగా ఉన్నది తిరుత్తణిలో, ఆయనని శాంతి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అని అంటారు.

భగవాన్ కూడా గోచీ పెట్టుకుని తిరుగుతూ ఉంటే పళనీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలాగే ఉండేవారు. భగవాన్ తోటి ఒకరు పళని వెళుతున్నాము సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి అన్నారు. మీరు ఫళనీ వెళుతున్నారా, అక్కడ ఉన్న స్వామే కదా ఇక్కడికి వచ్చినవాడు అన్నారు.

దాని అర్థం ఏమిటి అంటే భగవాన్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అంశ అని అంగీకరించినట్టు. శివుడు అవ్యక్తం. సుబ్రహ్మణ్యుడు వ్యక్తం. శివుడు పాతరూపాయి, సుబ్రహ్మణ్యుడు కొత్త రూపాయి. మనకి శివుడు అవ్యక్తం అయితే అందులోంచి ఆకాశము వచ్చింది. ఆకాశంలోంచి వాయువు వచ్చింది. వాయువులోంచి అగ్ని వచ్చింది. అగ్నిలోంచి నీరు వచ్చింది. నీట్లోంచి మట్టి వచ్చింది. మట్టివచ్చాకే ఈ భూమి మీదకి జీవకోటి వచ్చింది. ఇది సృష్టిక్రమం. పంచభూతాలే సృష్టి.

మీరు అరుణాచలం గుడిలోకి వెళ్లగానే ముందు బాలసుబ్రహ్మణ్యుడు ఉంటాడు. తరువాత చిలుక గోపురం వస్తుంది. అక్కడే సుబ్రహ్మణ్యుడు అరుణగిరినాథర్‌కి దర్శనమిచ్చాడు. అరుణగిరినాథర్‌కి చిన్నప్పడే తల్లిదండ్రులు చనిపోయారు. అరుణగిరినాథర్‌కి చదువులేదు వీడిని ఎవరూ పట్టించుకోక చెడ్డఅలవాట్లకి వెళ్లి పాడయిపోయాడు. అక్కగారు చేరదీసి కొంతకాలం పెంచింది. అరుణగిరినాథర్ పూర్వపుణ్యం ఉన్నవాడు. ఏదో చిన్నచిన్న దోషాలని బట్టి చెడ్డఅలవాట్లలోకి వెళ్లాడు కాని దుర్మార్గుడుకాదు. ఒకరోజున అక్కగారు నీ పద్ధతి ఏమీ బాగోలేదు. నీపద్ధతులు మార్చుకోవటం లేదు అని తిట్టింది. ఆ తిట్లకి అతను అవమానపడి చిలుక గోపురం ఎక్కి కిందపడి చచ్చిపోదాం అని పైనుంచి ఉరికాడు. అప్పడు సుబ్రహ్మణ్యుడు వచ్చి కింద పడకుండా వాడిని చేతులతోటి పట్టుకున్నాడు. ఆ గోపురం దగ్గర కూడా సుబ్రహ్మణ్యుడి గుడి ఉంది. అరుణగిరినాథర్‌కి అరుణాచలానికి సంబంధం ఉంది. తరువాత అతను త్యాగరాజులాగే గొప్పరచయిత అయ్యాడు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అనుగ్రహం వలన తిరుప్పగళ్ రాశాడు. తిరుప్పగళ్ అంటే అందులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మీద తప్పించి ఇంకో పాట ఉండదు. తిరుప్పగళ్ తమిళియన్స్ ఎక్కువ పాడుకుంటారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వాహనం నెమలి. నెమలి కింద పాము ఉంటుంది. నెమలి ఆపాముని కాళ్లతో తొక్కి ఉంచుతుంది. ఆ సర్పమే మన అహంకారం. పాముకి కోపం వస్తే తొందరగా తగ్గదు. మన అహంకారం కూడా పాములాంటిదే. ఆ నెమలి పామును ఎందుకు తొక్కి పెట్టిందంటే, అలా మనం కూడా మనలో ఉన్న అజ్ఞానాన్ని, మన అహంకారాన్ని తొక్కిపెట్టి దానిని నాశనం చెయ్యకపోతే మనకి ఆత్మజ్ఞానం కలుగదు. ఒక నెమలి భగవాన్ కూడా తిరుగుతూ ఉండేది. ఒకసారి భగవాన్ ఎవరితోనో మాట్లాడుతున్నారు. అక్కడికి ఒక

పెద్దపాము వచ్చింది. పాముని నెమలి, ముంగిస తేలికగా చంపేస్తాయి. నెమలి బాగానే ఉంది. పాము నెమలిమీద పడగవిప్పి యుద్ధానికి రమ్మంటోంది. అది భగవాన్ చూచి ఏరా బుద్ధిలేదా నీకు, అసలు ఈ గ్రౌండులోకి నిన్ను ఎవడు రమ్మన్నాడు. ఏదో నేను ఉన్నానని వాడు ఆలోచిస్తున్నాడు లేకపోతే ఈపాటికి నిన్ను చంపేద్దుడువాడు నిన్ను ఎవడైతే చంపగలడో వాడి ఎదురుగుండా పడగ ఇప్పతావా ఏమిటి, ఫోఫో అన్నారు. భగవాన్ మనతో చెప్పినట్టే జంతువులకు కూడా చెప్పేవారు. అప్పడు ఆపాము వెళ్ళిపోయింది. భగవాన్ గురించి గణపతి శాస్త్రిగారు ఏమన్నారు అంటే అనృత దోషము ఎలా ఉంటుందో తెలియని వాక్కుతోటి చెబుతున్నాను సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అంశే భగవాన్ అని రమణగీతలో చెప్పారు. మీరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అంశవల్ల జన్మించారు అని గణపతిశాస్త్రిగారు చెబుతున్నారు అంటే, ఆయనని అనుకుంటే అనుకోనివ్వండి. ఆయన నోరు నేను కట్టగలనా. గుడిలో విగ్రహంపెట్టి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అంటున్నారుకదా అలాగే ఈ శరీరాన్ని అనుకుంటే అనుకోనివ్వండి అనేవారు కాని గణపతిశాస్త్రిగారి మాటలకు ఆయన ఏమీ సంతోషించలేదు.

తపస్సు అంటే భోజనాలు మానేయటంకాదు. మీరు దేహభావన తగ్గించుకుని, మనోభావన తగ్గించుకుని నిజమైననేనులో ఉంటే జాగ్రదావస్థలో కూడా నిలకడగా, నిశ్చలంగా వుంటే అదే తపస్సు అన్నారు భగవాన్. అహమపేతకం నిజవిభానకం అంటే అహంకారాన్ని తొలిగించుకుని నిజమైననేనులో నువ్వు ఉండకలిగితే అక్కడినుంచి నీకు ప్రకాశం తెలుస్తుంది. అదే నిజమైన తపస్సు. నిజమైన నేనుని తెలుసుకోవటానికి నువ్వు చేసే ప్రతీ ప్రయత్నం కూడా తపస్సే. నువ్వు అబద్ధమైన ఈనేనుని తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. కృష్ణుడు నేను, నేను అంటాడు అక్కడ నేను అంటే ఈ దేహగతమైన నేనుకాదు. అది చైతన్యగతమైన నేను. దానికి హద్దులులేవు, పరిమితులు లేవు. దానికి ఉండటం, పోవటం అంటూ ఏమీలేదు. సృష్టి ఉన్నప్పడు, సృష్టి అంతమైపోయాక కూడా వాడు ఉంటాడు. అది నిజమైన నేను. వాడు ఆనందస్వరూపుడు. వాడు నీకు అనుభవంలోకి వచ్చేవరకు ఏదో సంతోషాలకోసం, సుఖాలకోసం ప్రపంచంలో పడి అలా తిరుగుతూనే ఉంటావు. నేను యెహోవాకంటే ముందు ఉన్నాను అన్నాడు ఏసు. ఏసుని యెహోవా కుమారుడు అంటారు. వాళ్ళు దేవుడిని యెహోవా అంటారు. తండ్రి కంటే పిల్లవాడు ముందు ఎలా ఉంటాడు. నేను యెహోవా కంటె ముందు ఉన్నాను అంటే ఈ సృష్టి ప్రారంభించకముందు,

పంచభూతాలు లేనప్పుడు కూడా ఆ నేను ఉంది. అదే చైతన్యము, అదే ఆత్మ, అదే బ్రహ్మము. అదే నేను అయి ఉన్నాను అన్నాడు. మీకు నిద్దట్లో ఏది అణిగిపోతే మిగతావన్నీ అణిగిపోతున్నాయో దానిని నువ్వు జాగ్రదవస్థలో నిగ్రహించి బయటకు లాగి నిప్పపెట్టి శవాన్ని ఎలా కాలుస్తారో అలా బర్న్ చేస్తే అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది కాని కబుర్ల వల్ల, కాకరకాయల వలన జ్ఞానం వచ్చేది కాదు.

చీకటిలో ఏదైనా తాడు ఉంటే అది తాడో, పామో మనకు తెలియదు, అప్పడు బ్యాటరీలైటు దానిమీద ఫోకస్ చేస్తే అది ఏదయినదీ మనకు తెలుస్తుంది. అలాగే మీ ఇంద్రియాల్ని, మీ మనస్సుని, మీ బుద్ధిని, మీ తెలివితేటల్ని, మీ వివేకాన్ని ఆ నిద్దట్లో ఉన్న నేను మీద ఫోకస్ చేస్తే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది కాని లేకపోతే ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. అంటే మీ శరీరానికి, మీమైండుకి, మీబుద్ధికి, మీ తెలివికి డైవర్షన్ ఉండకూడదు. అందుచేత నువ్వు చిల్లరగొడవలలోకి వెళ్లవద్దు. నీ మనస్సుకి బహిర్ముఖవృత్తి ఎక్కువ ఉంటే సాధన ద్వారా వ్యక్తిభావనని తగ్గించుకుంటూ దానిని అంతర్ముఖంచేసి, ఎక్కడయితే పరమాత్మ నివాసంగా ఉన్నాడో అక్కడకు ఈ మనస్సును మళ్లించటంకోసమే కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం, ఈ యోగాలన్నీ మనస్సుని ఆధ్యాత్మిక హృదయం లోనికి తోలుకెళ్లటం కోసమే పరమాత్మ చెప్పాడు. స్వామి శివానంద ఆయన జీవిత అనుభవాలలో ఏమని చెప్పారంటే నేను రమణమహర్షిగారి లాగ అజ్ఞానంలోంచి జ్ఞానంలోకి, మృత్యువులోంచి అమృతత్వంలోకి ఒక్కసారి జంప్‌చేయలేదు. రమణ మహర్షిగారు దత్తుడు. అందుచేత ఏమీ కష్టపడకుండా ఆయన పొందవలసింది పొందేశారు. మేడపైకి వెళ్లాలంటే ఒకోమెట్టు, ఒకోమెట్టు ఎక్కివెళ్లాలి అలాగే నేను కష్టపడి ఒకోమెట్టు, ఒకోమెట్టు కట్టుకుని నా అంతట నేను పైకి వచ్చాను. నాకు చిన్నప్పడు భక్తి ఎలా కలిగింది అంటే మా నాన్నగారు రోజూ పూజ చేసుకునేవారు. నాకు భక్తి కలగటం కోసం పువ్వులు, అగరవత్తులు, పసుపు, కుంకుమ అన్నీ దేవుడి దగ్గర పెట్టమనేవారు. ఆయన పెట్టుకోలేక కాదు, పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నాకు భక్తి కలగటంకోసం అలా చేసేవారు. నిజంగా భగవంతుడు ఆ రూపంలో ఉన్నాడు అని ఆయన అంత శ్రద్ధగా చేస్తూ ఉంటే అక్కడ నుంచే నాకు భక్తి కలగటం ప్రారంభమయ్యింది. తరువాత నేను డాక్టరుని అయ్యాను. వీడు ధనవంతుడు, వీడు పేదవాడు అని చూడకుండా అందరికీ సమానంగా వైద్యం చేసి అందరిలోను పరమాత్మని చూడటం నేర్చుకున్నాను అది ఒక మెట్టు.

నాకు పెళ్లి చేసుకోవాలనే కాంక్ష లేదు. అందుచేత నేను హృషీకేష్ వెళ్లిపోయి అక్కడ స్వర్గాశ్రమంలో ఒకపూట భోజనం చేసి ఒకపూట పండు తిని తపస్సు చేయటం ప్రారంభించాను. తపస్సు చేస్తే ముందు క్రమశిక్షణ వచ్చింది. తరువాత ఇంద్రియాలు, మనస్సు అణిగిపోయినాయి, నేను తపస్సు చేయకముందు ఈశ్వరుడు నాకు పరాయివాడిగా ఉండేవాడు. నేను మేడ ఎక్కుదామని చివరి మెట్టుదగ్గరికి వచ్చేటప్పటికి నాకు పరాయివాడిగా ఉండటం మానేసి నా స్వరూపంగా వ్యక్తమయ్యాకే ఈశ్వరుడుకి నాకు భేదంలేదు అని అప్పుడు నాకు తెలిసింది. విశ్వాసానికి కళ్ళులేకపోవచ్చు నీకు కళ్ళు ఉన్నాయి. అలాగే నువ్వు దేవుడిని నమ్మవచ్చు కాని ఆ నమ్మకంలో దానికి కూడా కళ్ళు లేకపోవచ్చు. కానీ అనుభవానికి కళ్ళు ఉంటాయి. కళ్ళు లేకుండా అనుభవం ఉండదు. నిప్ప మీద చెయ్యి వేస్తే అది కాలుతుంది అని నీకు తెలుసు. అది కాలదని కొన్నికోట్లమంది చెప్పనివ్వండి నువ్వు నమ్మవు. ఎందుచేత అది నీ అనుభవం. అట్టి అనుభవం నేను స్వర్గాశ్రమంలో పొందాను. నా అనుభవాన్ని, నేను పొందుతున్న శాంతిని, ఆనందాన్ని పదిమందికి పంచిపెట్టాలని అప్పుడు శివానందఆశ్రమం నిర్మించటం జరిగింది. జ్ఞాని ఎవడినీ ప్రేమించాలని ప్రేమించడు. ప్రేమించకుండా ఉండలేక ప్రేమిస్తాడు. అటువంటి వాళ్ళని మనం దర్శిస్తే చాలు.

మనకి గురువుతోటి సంబంధం కలిగితే, ఆ గురువు మనకి స్వరూపంగా వ్యక్తమయ్యే వరకూ ఆ సంబంధం కంటిన్యూ అవుతుంది. నిజమైనగురువు మన హృదయంలోనే చైతన్య రూపంలో అంతర్యామిగా ఉన్నాడు. మనకి జ్ఞానం సంపాదించాలి అని ఉన్నా చీకటిలో మనకి ఎటువెళ్ళాలో మార్గం నిర్దేశం లేనప్పడు మనకున్న భక్తి, తపన, మనకున్న జిజ్ఞాస నిజమైతే, మన మనస్సుని మనం నిర్మలం చేసుకోవాలి అనేటువంటి తలంపు నిజమైతే హృదయంలో అంతర్యామిగా ఉన్న పరమేశ్వరుడే ఒక మానవరూపం ధరిస్తాడు. వాడు బాహ్యగురువు. నువ్వు రాంగ్‌పాత్‌లో ప్రయాణం చేస్తున్నప్పడు, నిన్ను రాంగ్‌పాత్‌లోంచి తప్పించి రైట్‌పాత్‌లో పెట్టి, ఆయన దయ పొందటానికి నీకు అర్హత లేకపోయినా అర్హత పొందేటట్టు చేసి, నిన్ను బయట ఆకర్షణలకి వెళ్ళకుండా కాపాడతాడు. బహిర్ముఖంగా ఉన్న మనస్సుని లోపలికి గెంటుతాడు. నువ్వు వాడి చేతికి దొరికేవరకూ లోపలఉన్న గురువు అలా వెయిట్ చేస్తాడు వాడి చేతికి దొరికాక వాడు నిన్ను లోపలకు గుంజుకుని తన స్వరూపం

నీకు ప్రసాదిస్తాడు. అదే జ్ఞానం.

మనం జాగ్రదవస్థలో పనిచేసుకుంటాము. నిద్రావస్థలో మనం విశ్రాంతి తీసుకుంటాము. మరి ఈ స్వప్నావస్థ ఎందుకు అని ఒకరు అడిగారు. స్కానింగు మన శరీరంలో ఉన్న రోగాన్ని ఎలా చూపిస్తుందో అలాగ జాగ్రదవస్థలో ఉన్నటువంటి బలహీనతలన్నిటినీ ఒకసారి నీ మనస్సు నీకు స్వప్నంలో చూపిస్తుంది. నీ బలహీనత తెలిసాక జాగ్రదవస్థలో దానికి తగిన సాధన చేసి ఆ బలహీనతలను తొలగించుకొని నువ్వు బాగుపడటానికి స్వప్నం కూడా ఉపయోగపడుతుంది. నీ బలహీనతలు నీకు జాగ్రదావస్థలో తెలియవు. స్వప్నంలో తెలుస్తాయి. గాంధీగారు అన్నారు వాసనలు బాహ్యంగా లేవు నా వాసనలు మీకు కనబడటం లేదు కాబట్టి మీరు అందరూ నన్ను మహాత్ముడు అంటున్నారు. నాలో వాసనలు సూక్ష్మరూపంలో, బీజరూపంలో ఉన్నాయి. అవి కాలి బూడిద అయ్యేవరకూ నన్ను మహాత్ముడు అనవద్దు అన్నారు. మహాత్ముడు అయ్యేవరకూ మనిషి దురాత్ముడుగానే ఉంటాడు, దురాత్ముడిగా ఉన్నంతమాత్రంచేత వాడికి మహాత్ముడు అయ్యే యోగ్యత లేదనికాదు. అది పెద్దల అనుగ్రహం వలన వస్తుంది. భగవంతుడి అనుగ్రహం మనకు కలిగితే బలహీనతలు అన్నీ సూక్ష్మరూపంలో ఉండగానే అణిగిపోతాయి, అవి స్థూలరూపంలోకి వెళ్ళి విజృంభించవు. అందుచేత కొంతమంది భగవంతుడిని వాళ్ళ బలహీనతలు పోగొట్టుకోవటానికి పూజ చేస్తారు, జపం చేస్తారు, ధ్యానం చేస్తారు. వీటి అన్నింటియొక్క ప్రయోజనం మనోనాశనం కోసమే. మనకి ఎంతోకొంత భక్తి ఉంది కాని అది గోరువెచ్చని నీళ్ళ భక్తి. కొంతమంది కాలక్షేపానికి రామా, రామా అనుకుంటారు. కానీ రాముడిపేరు ఎవరూ సిన్సియర్‌గా తలపెట్టరు. రామా అన్నప్పుడు ఆ శబ్దంలో వాళ్ళ హృదయం ఉండదు. హృదయం ఎక్కడో ఉంటుంది. నువ్వు నామం చేసేటప్పుడు అక్కడ మీ హృదయం ఉండాలి, మీ మనస్సు ఉండాలి. అప్పుడు ఆ మనస్సు పవిత్రం అవుతుంది, ఏకాగ్రం అవుతుంది. ఇంతవరకు ఈ సృష్టిలో పవిత్రుడు కానివాడు ఎవడూ ఆత్మకారము పొందలేదు. అందుచేత నువ్వు పరమపవిత్రుడు అవ్వటానికి ప్రయత్నం చెయ్యి.

నాకు ముందు భక్తిని ప్రసాదించండి. నేను ముక్తికోసం కంగారు పడటంలేదు అని ఒకరు భగవాన్‌ని అడిగారు. మన శరీరాలు ఎక్కడ ఉన్నాయి అన్నది ముఖ్యం కాదు. మనస్సు ఎక్కడ ఉన్నది అనేది ముఖ్యం. మనకి గురువు పట్ల, ఈశ్వరుడి పట్ల మానసిక

అనుబంధం ఉండాలి. అది భక్తి. నీకు భక్తి కావాలి అంటున్నావు. నేను ఇచ్చేది ఏమిటి? నీ తపనే నిన్ను బాగుచేస్తుంది. మనం బాగుపడాలి అనే తపన లోపలినుంచి రావాలి కాని బయటినుంచి వచ్చేది కాదు. నీకు భవిష్యత్తులో తరించే అవకాశం ఉంది కాబట్టి నీకు తపన వస్తోంది లేకపోతే నీకు తపన రాదు. నేను ఎవడిని నీకు ఇవ్వటానికి? ఆ నిజమైన నేను ఇంటర్‌ఫీరియన్స్ లేకుండా, దానియొక్క గ్రేస్ లేకుండా నీకు అది తెలియబడదు. సాధన చేయటంలో నువ్వు భయపడవద్దు. ఫియర్‌లెస్‌గా ఉండు. పిరికివాడు ఈ లోకానికి పనికిరాడు, పరలోకానికి పనికిరాడు. పిరికితనం నువ్వు ముందు వదిలేయి. పిరికితనమే నీకు విరోధం. భయస్తుడు, బద్ధకస్తుడు సాధన సరిగ్గా చేయలేడు. నీకు ధైర్యం తక్కువగా ఉంటే ధైర్యాన్ని కల్టివేట్ చెయ్యి. ఎంతమాత్రం నీ హృదయంలోకి దౌర్భల్యం వచ్చినా నువ్వు మార్గం తప్పిపోతావు. అన్నిటికంటే నీచమైనది హృదయదౌర్భల్యం. ఇది సాధించగలమా, లేదా అని ఎప్పటికప్పుడు అనుమానం పెట్టుకొంటూ ఉంటే హృదయదౌర్భల్యం వస్తుంది. నువ్వు సాధన చేసేటప్పుడు పతనం అవుతూ ఉండవచ్చు. మీరు కంగారు పడనక్కరలేదు. బంతిని కిందవేసి కొడితే బంతి అలా ఉండదు. మళ్ళీ పైకి లేస్తుంది. అలాగే నువ్వు ఒకసారి పడిపోయినా లేచి మళ్ళీ నడువు. నువ్వు బంతిలాగ ఉండాలి. నీకు వచ్చే కష్టాలను చూచి కంగారుపడకు. ఇవన్నీ మాయ. నీకు కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా నీకున్న బలాన్ని పరిశీలన చేయటానికి అవి వస్తాయి. ప్రపంచంలో ఎక్కడ ఏది జరిగినా భగవాన్ ఎప్పుడూ ఆశ్చర్యం వ్యక్తపరచలేదు. అది అలా జరగవలసి ఉంది జరిగింది అంతే. అది ఈశ్వరఆజ్ఞ. ప్రపంచం అంతా భగవంతుడు వ్యాపించి ఉన్నాడు. ఆయనకి తెలియకుండా ఏదీ జరగటానికి వీలు లేదు అనేవారు భగవాన్.

భక్తి ఎంతవరకూ ఉండాలి అంటున్నావు? నీ మనస్సు జ్ఞానంలో కరిగిపోవాలి. జ్ఞానంలో కరిగిపోయేటంత భక్తితో నీ మనస్సుని నింపాలి. ఏ మనస్సు అయితే నీకు అడ్డు వస్తోందో ఆ మనస్సు నిండా భక్తి నింపి, అది జ్ఞానాగ్నిలో కాలిపోయేలాగ చేసుకో. అంతవరకూ నీ భక్తిని తీసుకువెళ్ళు. నీ మనస్సు హృదయంలో చైతన్యంలో కరిగిపోవాలి. అంటే నో మైండు స్టేట్‌కి వెళ్ళిపో. నీ భక్తి గోరువెచ్చని నీళ్ళకింద ఉండకూడదు. నో మైండు స్టేట్‌కి వెళ్ళాలనే తీవ్రకాంక్ష ఉండాలి. మనస్సు అణిగిపోవటం కాదు. మనస్సు పూర్తిగా నాశనం అవ్వాలి. వలలో పడ్డ పక్షి

చచ్చిపోదు, కదలకుండా వలలో ఉంటుంది. అలాగే నువ్వు ప్రాణాయామాలు, యోగాభ్యాసాలు చేసి మనస్సుని అణిచిపెట్టి ఉంచినప్పటికీ మళ్ళీ అభ్యాసం వదిలేస్తే మనస్సు విజృంభిస్తూ ఉంటుంది. అది సరిపోదు. మనోనాశనం అవ్వాలి, వలలో పక్షి ఉండటం వేరు, పక్షి చనిపోవటం వేరు. పక్షి చనిపోతే వల తీసినా అది ఎగరదు. మనస్సు అణిగినవాడికి సత్యదర్శనం అవ్వదు. మనోనాశనం అయినవాడికి సత్యదర్శనం అవుతుంది.

మీకు ఎన్ని సంపదలు ఉన్నా ఎగిరి, ఎగిరి పడకూడదు. అణిగి ఉండాలి. వినయమే నిజమైన సంపద. అక్కడికే జ్ఞానం చేరుతుంది. నువ్వు వెదికే వస్తువు ప్రపంచములో లేదు, నీ హృదయములో ఉంది. నువ్వు ఏ రూపాన్ని ఆరాధించినా, ఏ యోగంలో ప్రయాణం చేసినా నీ హృదయంలోనికి నువ్వు చేరుకోవాలి. నీ మనస్సుని నిర్మలం చేసి, దానిని మధురం చేసి, నీ మనస్సుని నువ్వు అనుకూలంగా చేసుకుంటేగాని అది అసలు హృదయం వైపుకు ప్రయాణం చెయ్యదు. మీరు సాధన చేస్తున్నట్టు మీకు గుర్తు ఏమిటి అంటే మీ ఇంద్రియాలు, మీ మనస్సు మిమ్మల్ని బాధపెట్టకూడదు. బయట పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మన మనస్సు మీద పడకుండా చూచుకోవాలి. అప్పుడు మీరు సాధన చేస్తున్నట్టు.

మూసుకుపోయిన జ్ఞానమార్గాన్ని ఓపెన్ చేయటానికి వచ్చిన గురువు రమణమహర్షి. ఒకవేళ చెడ్డ ప్రారబ్ధం మిమ్మల్ని తరుముతున్నప్పటికీ, ప్రారబ్ధం ఎవరికి? శరీరానికి మాత్రమే. మంచి ప్రారబ్ధం అయినా శరీరానికే, చెడ్డ ప్రారబ్ధం అయినా శరీరానికే. జ్ఞానాగ్ని వల్ల దేహబుద్ధి ఎప్పుడైతే కాలిబూడిద అయిపోయిందో, మీ శరీరం ఎంత చెడ్డ ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ మీకు దుఃఖ స్పర్శ రాదు. అదే రమణానుగ్రహం. నీ దేహం ప్రారబ్ధం ఎలా అనుభవిస్తున్నప్పటికీ, దేహం నువ్వు కాదు అనే బుద్ధి నీకు వచ్చినప్పుడు, దేహబుద్ధి నశించినప్పుడు నువ్వు ఎంత చెడ్డ ప్రారబ్ధం అనుభవిస్తున్నా నీకు ఎర్రచీమ కుట్టినట్టు కూడా ఉండదు. అదీ రమణ సిద్ధాంతం. అక్కడికి మన కళ్ళు తెరిపించటానికి వచ్చిన అవతారమే రమణావతారం.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-12-2011, అరుణాచలం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున మనందరం ఇక్కడ సమావేశం అవ్వటానికి కారణం సాయంత్రం 6